క్లుప్తంగా

22న జాబ్ మేళా

రంగారెడ్డినగర్: తెలంగాణ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఈనెల 22న కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. సుమారు 100కు పైగా కంపెనీల్లో వేయి ఉద్యోగావకాశాలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లమో, బీఫార్మా, ఎంఫార్మా, బీటెక్, డిగ్రీ, ఎంబీఏ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

దుండిగల్: అర్హులైన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపాలిటీ పరిధి చర్చిగాగిల్లాపూర్ 28వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన అందరికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. త్వరలోనే ఈ శిబిరం ముగుస్తుందన్నారు.

పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ సభ పోస్టర్ ఆవిష్కరణ

రంగారెడ్డినగర్: అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఈనెల 15న మల్లాపూర్‌లోని వీఎస్‌ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరుగనున్న పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ సభ పోస్టర్‌ను బుధవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విశ్వకర్మ సెల్ కోకన్వీనర్ గోవర్ధన్‌చారి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంత్ చారి, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ వర్మ, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఇంటర్‌లో సత్తాచాటిన శ్రీశాస్త్ర జూనియర్ కళాశాల

కూకట్‌పల్లి: నిజాంపేట రోడ్డులోని శ్రీశాస్త్ర జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ప్రథమ సంవత్సరంలో మొత్తం 68 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 15 మందికి 460 మార్కులు పైగా సాధించారు. అందులో స్వాందితరెడ్డి 464, యశ్వంత్‌సాయి 464, హర్షిన్ 463, త్రిసాల్య 463, యశశ్రీ 463, గౌరి 463, హర్షతేజ్ 463, సర్వజిత్ 462 మార్కులు సాధించారు. అదే విధంగా 38 మంది విద్యార్థులు 450 మార్కులు పైగా సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్‌లు కిరణ్, లావణ్యలు అభినందించారు.

అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్‌ఎంఎఫ్‌ల ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు పైసల కక్కుర్తితో పేదలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. వారిని వెంటనే శాసనసభ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

సర్కారు బడి.. ఉత్తీర్ణతలో మేటి

టెన్త్‌లో ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



హాసిని, 10 జీపీఏ

దుండిగల్: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించిన ఫలితాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నిరుపేద విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10/10, 9కు పైగా జీపీఏ సాధించడం విశేషం.

ఉత్తీర్ణతలో గాగిల్లాపూర్ పాఠశాల ఫస్ట్..

నియోజకవర్గంలోని మొత్తం 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 1,844 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో 1,420 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 77 ఉత్తీర్ణత శాతం సాధించారు. గాగిల్లాపూర్ పాఠశాల 96.55 ఉత్తీర్ణత శాతం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో భగత్‌సింగ్‌నగర్(95), మూడో స్థానంలో బహదూర్‌పల్లి(92) నిలవగా చివరి స్థానంలో షాపూర్‌నగర్(58.97) ఉంది.

బాలికలదే పై చేయి..

ఈ దఫా కూడా బాలికలదే పై చేయిగా నిలిచింది. బాలురు మొత్తం పరీక్షలు 840 రాయగా 598 మంది పాస్ కాగా 71 ఉత్తీర్ణత శాతం.. బాలికలు 1004 మంది రాయగా 822 మంది పాసై 82 శాతం ఉత్తీర్ణత సాధించి 11 శాతంతో బాలురపై బాలికలు పై చేయి సాధించారు.

10/10 సాధించిన ముగ్గురు విద్యార్థులు..

సూరారం కాలనీ పాఠశాల విద్యార్థిని అఫ్షన్ జమీన్, జగద్గిరినగర్ పాఠశాల విద్యార్థిని జె.శరణ్య, కొంపల్లి విద్యార్థిని ఎస్.హాసినిలు 10/10 జీపీఏ సాధించారు. అదే విధంగా 60 మందికి పైగా విద్యార్థులు గ్రేడ్ 9 సాధించారు.

పెరిగిన ఉత్తీర్ణత శాతం..

గతంతో పోలిస్తే ప్రతి ఏడాది ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 2015-16లో 60, 2016-17లో 65, 2017-18లో 72.14, 2018-19లో 81.14 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2019-20, 2020-21 కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించలేదు. 21-22లో 62.05 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది 22-23లో తిరిగి 77 శాతం సాధించింది.



నిఖిత, 9.7 జీపీఏ



మీనాక్షి, 9.7 జీపీఏ



శర్మ ఖాతున్, 9.7 జీపీఏ

పాఠశాల పేరు	విద్యార్థులు	ఉత్తీర్ణులైనవారు	ఉత్తీర్ణతశాతం
బాచుపల్లి	77	61	79.22
నిజాంపేట్	112	95	84.82
ప్రగతినగర్	65	49	75.38
బహదూర్‌పల్లి	50	46	92
బౌరంపేట	67	60	89.55
దూలపల్లి	58	44	75.86
దుండిగల్	135	119	88.15
గాగిల్లాపూర్	29	28	96.55
కొంపల్లి	90	70	77.78
మల్లంపేట్	83	67	80.72
భగత్‌సింగ్‌నగర్	20	19	95
గాజులరామారం	77	60	77.92
గాంధీనగర్	63	43	68.25
గురుమూర్తినగర్	43	35	81.40
జగద్గిరినగర్	187	111	59.36
జీడిమెట్ల	108	90	83.33
నెహ్రూనగర్	90	69	76.67
కుత్బుల్లాపూర్	171	128	74.85
షాపూర్‌నగర్	117	69	58.97
సూరారం గ్రామం	79	57	72.15
సూరారం కాలనీ	123	100	81.30
మొత్తం	1844	1420	77

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల జీవితాల్లో వెలుగులు



ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఎం.శంకర్(దుండిగల్), జి.శంకర్(జగద్గిరిగుట్ట), లక్ష్మి(గాజులరామారం), పల్లవి(ప్రగతినగర్) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉండటంతో శంభీపూర్ రాజును కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.9 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను మంజూరు చేయించారు. ఎం.శంకర్‌కు రూ.1.5 లక్షలు, జి.శంకర్, లక్ష్మి, పల్లవిలకు రూ.2.5 లక్షల చొప్పున ఎల్‌ఓసి పత్రాలను బుధవారం బాధితులకు అందజేశారు. దీనికి వారు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇప్పటికే ఎంతో మందికి రూ.కోట్లల్లో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా డబ్బులు అందించామని శంభీపూర్ రాజు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన కొడంగల్ ఎమ్మెల్యే..

కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బుధవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన సోదరుడు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కుమార్తె వివాహానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

కామారెడ్డిలో కూపీ లాగితే..

డొంక కుత్బుల్లాపూర్‌లో దొరికింది

- రూ.22.79 లక్షల విలువ చేసే మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల అక్రమ మద్యం వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. ఓ కేసులో కూపీ లాగిన అధికారులు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలో భారీ మొత్తంలో అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కామారెడ్డిలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ వివరాలు వెల్లడించారు.

◆ ఈనెల 3న కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామంలో గోవా, డిఫెన్స్‌లకు చెందిన మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకుని ముగురిని అరెస్ట్ చేశారు. ఇక్కడ నుంచి కూపీ లాగగా డొంక ఇక్కడ కదిలింది. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అక్రమ మద్యం జోరుగా నడుస్తున్నట్లు గుర్తించారు. ప్రధాన సూత్రధారి కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఆ తర్వాత గోవా, హర్యానా, డిఫెన్స్‌లకు సంబంధించిన నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం ముఠాను గుర్తించామన్నారు.

◆ సమాచారం తెలుసుకుని బుధవారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని బౌరంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లో అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ప్రధాన నిందితుడైన కృష్ణారెడ్డికి చెందిన ఇద్దరు సమీప బంధువులతో సహా మరో 8 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.22.79 లక్షల విలువ గల 497 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను, ఒక కారు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

◆ వారంతా కలిసి టూరిస్ట్ బస్సు డ్రైవర్ల ద్వారా గోవా, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లను మొదట హైదరాబాద్‌కు తెప్పించి వారి బంధువులు, స్నేహితులకు ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటారు. ఇంత పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం మొదటిసారని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. సమావేశంలో కామారెడ్డి ఎస్‌ఈ రవీందర్‌రాజ్, సీఐలు వేణుమాధవ్, విజయ్‌కుమార్, ఎస్సైలు మమత, విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రైవేట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



అత్యుత్తమ గ్రేడ్‌లు సాధించిన యూనిక్ పాఠశాల విద్యార్థులతో కరస్పాండెంట్ శివయ్య

కుత్బుల్లాపూర్: టెన్త్ పరీక్షా ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం విడుదలైన ఫలితాల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూళ్ల వద్ద సందడి నెలకొంది. విద్యార్థులు ఉత్తమ గ్రేడ్‌లు సాధించడంతో స్వీట్లు తినిపించి సంబరాలు జరుపుకున్నారు.

◆ సూర్యానగర్‌లోని యూనిక్ హైస్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో సత్తాచాటారు. 15 మంది 9.8 గ్రేడ్‌లు, 13 మంది 9.7 గ్రేడ్, 15 మంది 9.5 గ్రేడ్, 18 మంది 9.3 గ్రేడ్ సాధించగా పాఠశాల కరస్పాండెంట్ శివయ్య, ప్రిన్సిపాల్ నాగభూషణంలు విద్యార్థులను అభినందించారు.

◆ చింతల్ త్రివేణి బ్రాంచ్‌లో ఏడుగురు విద్యార్థులు 10/10 గ్రేడ్, 9.7 గ్రేడ్ 26 మంది, 9.0 గ్రేడ్ 52 మంది సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ చక్రీ, సీఆర్‌ఓ వెంకట్రావు లు విద్యార్థులను అభినందించారు.

◆ వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ గ్రేడ్‌లు సాధించారు. 10/10 గ్రేడ్ 5 మంది, 59 మంది విద్యార్థులు 9 గ్రేడ్ లు పొందారు. 10/10 గ్రేడ్ సాధించిన విద్యార్థులు కవిత, శివకృష్ణ, లక్ష్మి సరస్వతి శ్రావ్య, రోహిత్‌పూరి, శ్రీలక్ష్మిలను పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశం అభినందించారు.

◆ కొంపల్లి, సుచిత్ర బ్రాంచ్‌లకు చెందిన సెయింట్ ఆంథోనీ స్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. 9 మంది 10/10, 50 మంది విద్యార్థులు 9 ఆపై జీపీఏ సాధించారు.

ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషంగా ఉంది

రెసొనెన్స్ కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్ర రావు

దుండిగల్: ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని రెసొనెన్స్ కళాశాలల హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు ఎంపీసీలో 470కు గాను సాయి కీర్తన(467), మిథిల(467), లాస్యరెడ్డి(466), భావన(466), రషిత్మ(466), కృషి(465), సాత్విక(464)లతో పాటు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని అన్నారు. వీరి విజయంలో అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్ర రావు

అగ్నిప్రమాదమా.. ఆత్మహత్యనా?



జయకృష్ణ (ఫైల్)

జగద్గిరిగుట్ట: అగ్నిప్రమాదం అనుకున్నారు. ఫైరింజన్లు తెప్పించారు. కాని మంటలు ఆరాక ఓ వ్యక్తి శవమై కనిపించింది. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్‌కాలనీ, కమళప్రసన్న నగర్ చెందిన తిరుమని జయకృష్ణ(32) హుడా పార్క్ సమీపంలోని సోనా జిమ్‌లో కోచ్‌గా చేస్తున్నాడు. ఇతనికి భార్య దుర్గాభవాని (28) ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల నుంచి కమళప్రసన్న నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల తన సొంత ఊరైన భీమవరంలో భార్య పిల్లలని వదిలి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం తన బంధువైన చిన్నాతో గదికి వచ్చాడు. ఆ తర్వాత వేరే పనిమీద చిన్న బయటకు వెళ్లగా ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు పోలీసులకి, ఫైర్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. మంటలు అదుపులోకి తీసుకొచ్చి గదిని పరిశీలించగా జయకృష్ణ పూర్తిగా కాలి శవమై కనిపించాడు. ఈ ఘటన బెడ్‌రూంలో జరిగిందన్నారు. అతను ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు జరిగిందా, లేక ఇంకేమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేపట్టామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఏడుగురి అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ నిందితులు

కుత్బుల్లాపూర్: ప్యాసింజర్ ఆటోలో 6 కిలోల గంజాయిని తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్ర మీదుగా దూలపల్లి చౌరస్తా గుండా గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం 12గంటలకు సుచిత్ర చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ప్యాసింజర్ ఆటో (టీఎస్ 35టీఏ 3561)ను ఆపగా అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో అనుమానం వచ్చి ఆటోలో తనిఖీలు చేపట్టగా సీటు వెనుక మూడు బండిళ్ల తరలిస్తున్న 6కిలోల డ్రై గంజాయి పట్టుబడింది. నిందితులపై కేసు నమోదు చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు వారిని రిమాండ్‌కు పంపారు.